ప్రజాశక్తి
బుధవారం 04 అక్టోబర్ 2023



మార్గదర్శకాలకు అనుగుణంగా

ఓటర్ల జాబితా : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం నాడు కలెక్టరేట్లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓటర్ల సవరణ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణపై తీసుకుంటున్న చర్యలు కొత్త ఈవీఎంల పనితీరు సమీక్షించారు. ఓటర్ల సవరణలో 6,7,8, కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమీక్షిస్తున్నామన్నారు. వారి సూచనలతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 6,7,8, ఫారాలకు సంబంధించిన దరఖాస్తులు అందాయని వాటిలో 90 శాతం పరిష్కరించామన్నారు. కమిషన్ నిబంధనలకు అనుగుణంగా లేని దరఖాస్తులను తిరస్కరించామని తెలియజేశారు. కొత్తగా వచ్చిన ఓటింగ్ మిషన్లు ఇఎన్ఎస్ ద్వారా స్కానింగ్ చేసి ఈనెల 6వ తేదీలోపు ప్రత్యేక ఇంజినీర్లతో పరిశీలిస్తామన్నారు. 10వ తేదీకి ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు సమర్పించిన క్లైములు, అభ్యంతరాలు, బినామీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తదితర అంశాలను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న అంశాలను తిరస్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, చిన్నయ్య, పుట్టపర్తి తహశీల్దార్ నవీన్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మైముద్దీన్, నరసింహులు పాల్గొన్నారు.

పేదలందరికీ పట్టాలిస్తాం



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

- సిపిఎం నాయకుల సమక్షంలో హామీనిచ్చిన తహశీల్దార్
- సిపిఎం, పేదల పోరాటానికి దిగొచ్చిన అధికారులు
- 805 సర్వే నెంబర్‌లోనే ఇచ్చేందుకు సుముఖత
- 7న జాయింట్ కలెక్టర్‌తో సంప్రదింపులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరులో ఇళ్ల పట్టాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పేదలు చేస్తున్న పోరాటానికి స్పందన వచ్చింది. 805 సర్వే నెంబర్‌లో పట్టాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ తహశీల్దార్ నాగరాజు సిపిఎం నాయకులు, పేదలకు హామీ ఇచ్చారు. ఈ నెల 7వ తేదీన సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. అప్పటి వరకు భూస్వాధీన ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేదలు స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల కేంద్రంలో ఇళ్ల పట్టాల కోసం సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో పేదలు గత రెండు వారాలుగా భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాడు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. పెద్ద సంఖ్యలో పేదలు కార్యాలయం వద్దకు తరలొచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో కార్యాలయం బయట బైటాయించి పట్టాలు ఇవ్వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనకారుల వద్దకు ఎస్ఐ శ్రీనివాసులు వచ్చి మాట్లాడారు. తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన విరమించమని పేదలు తెలిపారు. దీంతో ఎస్ఐ తహశీల్దార్‌ను ఫోన్లో సంప్రదించి, విషయాన్ని తెలియజేశారు. తహశీల్దార్ ఈ సమస్య పరిష్కారంపై చర్చలకు ఒప్పుకున్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద భూస్వాధీన పోరాట కమిటీతో తహశీల్దార్ చర్చించారు. భూస్వాధీన పోరాటంలో భాగంగా 805 సర్వే నెంబర్‌లో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న చోటనే పేదలకు పట్టాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ స్థలం భవిష్యత్తు అవసరాల కోసం రిజర్వు చేశామని తహశీల్దార్ బదులిచ్చారు. మరో ప్రదేశంలో స్థలాన్ని చూశామని, అందులో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి కొంత సమయం పడుతుందన్నారు. ఈ స్థలాన్నే ప్రభుత్వానికి రిజర్వు చేసి, గతంలో లేవుట్ వేసిన 805 సర్వే నెంబర్‌లో పేదలకు పట్టాలు ఇవ్వాలని నాయకులు మరోసారి తహశీల్దార్‌ను కోరారు. ఇందుకు తహశీల్దార్ ఏకీభవిస్తూ పేదలు ఎక్కడైతే ఇళ్ల స్థలాలు కోసం గుడిసెలు వేసుకున్నారో అక్కడే పట్టాలు ఇచ్చేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు.

గుడిసెలు వేసుకున్న చోటే ఇళ్ల పట్టాలు ఇస్తాం : తహశీల్దార్



ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ పేదలతో మాట్లాడుతున్న తహశీల్దార్

కోడూరు లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల కోసం పేదలు వేసుకున్న గుడిసెల వద్దనే ఇళ్ల పట్టాలు ఇస్తామని తహశీల్దార్ నాగరాజు పేదలకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పేదల వద్దకు ఆయన వచ్చి మాట్లాడారు. ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకుని, 805లో గుడిసెలు వేసుకున్న పేదలకు అక్కడే పట్టాలు ఇస్తామన్నారు. అయితే ఇప్పటికే ఇది రిజర్వ్ చేసిన భూమి అయినందున విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. జాయింట్ కలెక్టర్‌కు పూర్తి వివరాలను తెలియజేసి పేదలకు పట్టాలు ఇచ్చేలా అను మతి తీసుకుంటా మని చెప్పారు. అక్కడి నుంచి ఆ స్థలంలో పట్టాలు ఇచ్చేందుకు అనుమతి రాకుంటే మరో ప్రదేశంలో లేఅవుట్ వేసి పేదలకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 7వ తేదీ శనివారం నాడు తనతో భూ పోరాట కమిటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ వద్దకొస్తే మాట్లాడి సమస్యను పరిష్కరించుకుందాం అని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు ప్రస్తుతం వేసుకున్న గుడిసెల వద్దనే పేదలు ఉంటారని సిపిఎం నాయకులు అధికారులకు తెలియజేశారు.

- పట్టాలిచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

పట్టాలిచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

చిలమత్తూరులో పేదలు కోరుకున్న స్థలంలో పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళన కార్యాక్రమంలో పాల్గొన్న ఆయన పేదలనుద్దేశించి ప్రసంగించారు. జగనన్న ఇంటి పథకం ఒక మాయ పథకం, 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామన్నది ఒట్టిమాటలేనన్నారు. వైసిపి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పడం మాటలకే పరిమితం అవుతోందన్నారు. చిలమత్తూరులో మూడున్నరేళ్లుగా పేదలు ఇళ్ల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సచివాలయం, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ పేదలు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. అధికారులు పట్టాలిస్తామని చెప్పి ఆ తరువాత వివిధ కారణాలతో ఇవ్వకుండా పలుసార్లు మోసం చేశారన్నారు. విలువైన భూమిలో పేదలకు ఇవ్వకూడదనే భావనను అధికారులే వ్యక్తం చేస్తుండడం విచారకరం అన్నారు. చిలమత్తూరు మండలంలోనే ఓ భూస్వామి 350 ఎకరాలను ఆక్రమించుకుని యథేచ్ఛగా కంచె వేసుకున్నా దానిని తొలగించలేని స్థితిలో అధికారులు ఉన్నారన్నారు. ఇళ్లు లేని పేదలు సెంటు స్థలం అడిగితే వారిపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఎర్రజెండా నీడన సాగే పోరాటంలో కేసులకు బయపడే ప్రసక్తే లేదన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నల్లా లక్ష్మినారాయణ, సిఐటియు జిల్లా నాయకులు పెనుకొండ రమేష్, ఆటో బాబావలి, లక్ష్మినారాయణ, వెంకటేష్, రామచంద్ర, సదాశివరెడ్డి, చందు, చరణ్, రహంతుల్లా, రియాజ్, శివ, మణిస్వామి, పేదలు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



తనకల్లులో జరిగిన నిరసనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మంగళవారం రైతు సంఘం, కార్మిక సంఘాల నాయకులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన బ్లాక్ డే ను నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతుల దుస్థితిపై పోరాటాలు చేస్తున్న రైతు సంఘం నాయకులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు పర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా పెట్టుబడి సాయం 50 శాతం అందించాలని, గిట్టుబాటు ధర నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ, ఎస్వీ రమణ, బాబయ్య, రమేష్, అంజి, ఆది, శంకర, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు ఎం శివన్న. వివి రమణ. ఎస్వీ రమణ. శ్రీరాములు, శంకర్ రెడ్డి. సిఐటియు నాయకులు ఒంటెద్దు వేమన్న. ఆర్ నరసింహారెడ్డి. శ్రీనివాసులు. లక్ష్మీనారాయణ.రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఉచితంగా విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

5న జగనన్న కాలనీలు ప్రారంభం

గోరంట్ల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈనెల 5వ తేదీన వర్చువల్ విధానంలో జగనన్న కాలనీలను ప్రారంభిస్తున్నట్లు హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. అందులో భాగంగా మండలంలో మల్లాపల్లి వద్ద గల జగనన్న లేఅవుట్‌లో గృహ సముదాయాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా రూ.14.50 లక్షలతో ముఖద్వారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, హౌసింగ్ ఏఈ జగదీష్ పాల్గొన్నారు.

సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలి

వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి - సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



సబ్‌కలెక్టర్ వద్ద ఆందోళన కార్యక్రమంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం కోగిర, శ్యాపురం, కంబాలపల్లి, బొక్సంపల్లి, బీదానపల్లి గ్రామాలకు చెందిన సాగుదారులు అందరికీ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివనాగరాణి డిమాండ్ చేశారు. కోగిర రెవెన్యూ పొలం సర్వే నంబర్ 666-669 ప్రభుత్వ భూమిలో సాగు చేస్తున్న దళిత, గిరిజన, వెనుక బడిన, పేద రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వ్యకాసం ఆధ్వర్యంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ అధ్యక్షతన పట్టణంలో గాంధీ సర్కిల్, దర్గా సర్కిల్ , అంబేద్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డిఎఒ ఛాంబర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ నాగరాణి మాట్లాడుతూ పేదలు సాగులో ఉన్నా పట్టాలు ఇవ్వడానికి అధికారులకు ఎందుకు చేతులు రావడం లేదని ప్రశ్నించారు. సాగుదారుల వివరాలను అధికారులు దాచిపెడుతున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గ పేద రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అధికారుల అండతోనే టింబక్ట్ వారు పేదల సాగు భూముల్లో గడ్డి విత్తనాలు దొంగగా వేశారని తెలిపారు. తక్షణం తహశీల్దార్, సబ్ కలెక్టర్ స్పందించి సాగు రైతులకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, అటవీ అధికారులు రహస్యంగా జరుపుతున్న భూ సర్వే పనులను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన విషయం తెలుసుకున్న పెనుకొండ ఎస్ఐ రమేష్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. నిరసనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు వచ్చి న్యాయం చేసేవరకు వెళ్లమని వారు తెగేసి చెప్పారు. స్పందించిన డిఎఒ, ఎస్ఐ రమేష్ బాబులు రొద్దం తహశీల్దార్‌ను ఫోన్‌లో మాట్లాడారు. విషయంను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, భూపోరాట కమిటీ నాయకులు రామాంజనమ్మ, అనితమ్మ, పద్మక్క, ఓబమ్మ, సుబ్రహ్మణ్యం, మారుతి, సాగుదారులు పాల్గొన్నారు.

డీ.హీరేహాల్‌లో ఇథనాల్ పరిశ్రమ



డి.హిరేహాల్ మండలం జాజరకల్లు గ్రామం వద్ద మొక్కజొన్న, బియ్యం నూక ఆధారిత డిస్టిలరీ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం ఇదే...

- రూ.544 కోట్లతో ప్రారంభం
- నేడు వర్చువల్‌లో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు జరుగనుంది. డీ.హీరేహళ్ మండలంలోని జుంజురాంపల్లి గ్రామంలో దీని ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రయివేటురంగంలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభించనున్నారు.

రూ.544 కోట్లతో ప్రారంభం

జుంజురంపల్లి గ్రామం పరిధిలో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమకు 29.95 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. రూ.544 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ వల్ల 500 మందికి ఉపాధి కల్పించనున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. ఎకో స్టీల్ అనే పరిశ్రమ దీని ఏర్పాటు చేయనుంది. నూకలు, మొక్కజొన్నలతో ఇథనాల్‌ను తయారు చేయనున్నారు. స్టీల్ రంగంలోనున్న ఈ పరిశ్రమ ఇప్పుడు ఇథనాల్ రంగంలోకి ప్రవేశించనుంది.

ఇథనాల్‌కు పెరుగుతున్న డిమాండ్

ఇథనాల్ తయారీని కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇథనాల్‌ను మద్యం తయారీలోకే కాకుండా వాహనాలకు ఇంధనంగానూ వాడుతున్నారు. దీంతో ఇథనాల్ తయారీని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అయితే ఈ సంస్థ సామర్థ్యం ఏ మేరకు అన్న దానిపై స్పష్టత లేదు. ఆ సంస్థ ఇంకా అధికారిక ప్రకటనేది చేయలేదు. ప్రారంభోత్సవ సందర్భంగానైనా పూర్తి వివరాలను ఆ సంస్థ ప్రకటించనుందా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. .

సమస్యల పరిష్కారానికి పోరాటం తప్పదు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో అతి పెద్దదైన ఏపీ పిటిడి నేషనల్ యూనిటీ అసోసియేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిన సందర్భంగా ఆ అసోసియేషన్ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం ఆర్టీసీ డిపో నుంచి ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక సాయి ఆరామంలో జరిగిన విజయోత్సవ సభ కు ఉమ్మడి అనంతపురం జిల్లాల నాయకులు 13 డిపోల నుండి పెద్ద ఎత్తున ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, రాష్ట్ర సిసిఎస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, కోశాధికారి పివివి. మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వి. రమణ, అనంతపురం జిల్లా కన్వీనర్ ముద్దపాటి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు శంకర్ నాయక్, శ్రీరామ్ నాయక్, సత్య సాయి జిల్లా రీజినల్ చైర్మన్ శ్రీరామ్, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : తలుపుల మండలం బత్రేపల్లెలో చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ , డాక్టర్ వెంకటరమణ విరాళం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులకు రూ.2లక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ప్రసాద్ ఇటీవల గణేష్ మండపము నందు డాన్స్ చేస్తూ మృతి చెందాడు. దీంతో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ముక్తం ఈశ్వరయ్యతో పాటు సంఘం సభ్యులు మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యంబా లింగన్న, ముకుతం మణిదీప్, శంకు సుధాకర్, మాబువలి, గోవిందు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలం గోళాపురం గ్రామంలో ఖరీఫ్-2023కు సంబంధించి మొక్కజొన్న పంటను తహశీల్దార్ స్వర్ణలత, ఎంపిడిఒ నరేంద్ర కుమార్‌తో, ఎఒ సురేంద్ర నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి వల్లీనాథ రావు, విస్తరణ అధికారి శంకర్, రైతు భరోసా సిబ్బంది ఉమా, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రజాశక్తి - బుక్కపట్నం

కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త సన్నప్పయ్య భార్య ఇటీవల అనారోగ్యం మృతిచెందింది. సన్నప్పయ్య కూడా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె సన్నప్పయ్యను మంగళవారం పరామర్శించారు. ఆర్థికసాయం అందించి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో మొక్కలు నాటిన విద్యార్థులు

రొద్దం : ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఫ్రాన్సిస్ స్కో లవ్ ఇన్ యాక్షన్ వారి సహకారంతో విద్యార్థులు మండలంలోని కెజిబివిలో మొక్కలు నాటారు. దాదాపు 200 మొక్కలు పాఠశాల ప్రాగణంలో మొక్కలు నాటినట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగరత్నమ్మ తెలిపారు. దీంతో ఆ మొక్కలకు నీటిని అందించేందుకు కూడా డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, బి.నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి పరిగి

మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ ఎక్స్‌పోర్టు ప్రయివేటు లిమిటెడ్ గార్మెంట్స్‌లో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బెంగళూరు లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు ఎజిఎం మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 168 మంది రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు గంగాధర్ పలువురు పాల్గొన్నారు.

నార్పలలో ఆక్రమణల తొలగింపు

నార్పల : భారీ పోలీసు బందోబస్తు మధ్య మండల కేంద్రంలోని పాత బస్టాండు, కుతలేరు వంక సమీపంలోని ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. గత కొన్నేళ్లుగా కుతలేరు నూతన వంతెన నిర్మాణం ఆగిపోయిన విషయం తెలిసిందే. వంతెన నిర్మాణం ముందుకు సాగాలంటే ఆక్రమణలు తొలగిపోవాలని అధికారులు చెబుతూ వస్తున్నారు. అయినా ఎవరూ వినకపోవడంతో మంగళవారం ఉదయం భారీ పోలీస్ బందోబస్తు మధ్య బస్టాండ్‌లోని పలు ఆక్రమణలను తొలగించారు. అయితే బస్టాండ్ ఆవరణలో ఉన్న పురాతన కొల్లపురమ్మ ఆలయాన్ని తొలగిస్తున్నారని ప్రచారం సాగడంతో గ్రామస్తులు భారీఎత్తున తరలివచ్చారు. అయితే కేవలం ఆక్రమణలను మాత్రమే తొలగిస్తున్నామని, ఆలయాన్ని తొలగించడమని తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలియజేయడంతో చాలామంది వెనక్కి వెళ్లారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రాష్ట్రస్థాయి పోటీలకు రాయాపురం విద్యార్థి

గుడిబండ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత నెల 29న జరిగిన అండర్ 17 వాలీబాల్ పోటీల్లో గుడిబండ మండలం ఎస్ రాయాపురం పాఠశాల విద్యార్థి వి. హనుమంతు ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల హెచ్‌ఎం నారాయణమూర్తి, పీడీ ఓం ప్రకాష్ తెలిపారు. పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న హనుమంతు ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కెనరా బ్యాంక్ బ్రాంచి ప్రారంభం

గోరంట్ల : పట్టణంలో కదిరి మెయిన్ రహదారిలో కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ను జనరల్ మేనేజర్ రవివర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 73 బ్రాంచ్ లు ఉన్నాయన్నారు. గోరంట్ల పట్టణంలో 74 వ బ్రాంచ్ ప్రారంభించామన్నారు. గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సేవలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ లార్సన్, గోరంట్ల బ్రాంచ్ మేనేజర్ విజయ్ కుమార్, డిఆర్‌డిఏ పీడీ తదితరులు పాల్గొన్నారు.

నారనాగేపల్లి విద్యార్థుల ప్రతిభ

రొద్దం : రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నారానాగేపల్లి విద్యార్థులు ఎన్నికైనట్లు పిఇటి మహేష్ తెలిపారు. త్రోబాల్ అండర్ -17 బాలికల విభాగంలో షాలిని అపర్ణ, త్రోబాల్ అండర్ -14 బాలికల విభాగంలో టి. సుకన్య, ఎ. ఇందు కబడ్డీ అండర్ -17 బాలికల విభాగంలో శోభా, త్రోబాల్ అండర్ - 17 బాలుర విభాగంలో శివ కష్ణ, సాయి రంగాచారి , షటిల్ బాడ్మింటన్ అండర్ - 17 బాలికల విభాగంలో భార్గవి ఎన్నిక అయినట్లు పిఇటి తెలిపారు. ప్రతిభా విద్యార్థులను హెచ్‌ఎం రంగప్పతో పాటు పిఇటి, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయం చేయండి

మడకశిర: తాము సాగుచేసుకుంటున్న భూములను తమకు దక్కకుండా చేయడానికి ఇతరులు ఇబ్బంది పెడుతున్నారని నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం రత్నగిరి గొల్లహట్ గ్రామ రైతులు వాపోతున్నారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన గద్దె జోగప్ప, చిత్తన్న, జోగన్న, బోరన్న తదితర రైతులు సర్వే నంబర్ 442 - 1 లో 5.68 ఎకరాల పొలాన్ని సాగుచేస్తున్నారు. భూమిలో ఇక్క చెట్లను కూడా నాటి ప్రతి సంవత్సరం దానిలో వచ్చిన ఫలాలను అనుభవిస్తున్నారు. అయితే ఇటీవల దీన్నే హట్టి చిట్టప్ప, సిద్దన్న, చిక్కన్న, పిల్లిగుండ్ల నాగన్న తదితరులు వారిపై దాడులు చేస్తూ మహిళలను ఇబ్బంది పెడుతున్నారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు పట్టించుకోవటం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్న అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఇవ్వాలని నిరసన

కొత్తచెరువు : కొత్త చెరువు ఎస్సీ కాలనీ రెండవ అంగనవాడీ కార్యకర్త పోస్టు గతంలో ఖాళీ ఏర్పడడంతో స్థానికేతరులను ఉన్నతాధికారులు ఎంపిక చేశారని వాటిని రద్దు చేసి ఆయాగా విధులు నిర్వహిస్తున్న తనకు ఇవ్వాలని యమున, ఆమె భర్త సాయి కోరారు. ఈ మేరకు వారు స్థానికనాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జీవో ప్రకారం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

'పది' పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కొత్తచెరువు : 2024 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల ఫీజు గడువు మరొకసారి పొడిగించినట్లు డీఈవో మీనాక్షి తెలిపారు ఈ నెల పదవ తేదీ లోపల అపరాధ రుసుము లేకుండా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఫీజు చెల్లించాలన్నారు 11 నుండి 16వ తేదీ వరకు 50 రూపాయల ఫైన్ తో చెల్లించాలన్నారు. 16 నుండి 23వ తేదీ వరకు 200 రూపాయలు, 24 నుండి 30 తేదీ వరకు 500 రూపాయల అపరాధ రుసుముతో ఫీజు చెల్లించవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

ధర్మవరం టౌన్ : ఆస్తి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో ప్రజలు పన్నుల సకాలంలో చెల్లించినప్పుడే పట్టణంలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బత్తలపల్లి : తాడిమర్రి మండల కేంద్రంలోనిమాల్యవంతం పార్నపల్లి వరకు రోడ్డు వెడల్పు పనులను స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిమర్రిలో మాల్యావంతం నుంచి పార్నపల్లి వరకు రోడ్డు వెడల్పు పనులను రూ. 8.10 లక్షల రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాడిమర్రి మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామన్నారు ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డితో పాటు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

పరిగి : మండలంలోని మోదా గ్రామానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఆర్‌డిటి చేయూత అందించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి పరిగి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోదా పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, పరిగి మండలం ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్, పీడీలు నరసింహామూర్తి, నాగభూషణ, ఉపాధ్యాయులు నరసింహామూర్తి, లక్ష్మీదేవమ్మ, కోచ్‌లు దుర్గా, పవన్ సాయి, జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం అమలు

కలెక్టర్ , ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధితులకు న్యాయంతో పాటు పరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ చట్టం పట్ల ఆ వర్గాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ మెంబర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని సేకరించి భవన నిర్మాణ పనులకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని వాటిని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, గ్రామాలలో స్మశాన వాటిక ఉండే విధంగా అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియ వారం రోజుల లోపల పూర్తి చేయాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతినెలా ఆయా మండలాల పరిధిలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలన్నారు. తనకల్లు లోని గిరిజన బాలికల వసతి గృహానికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పెనుకొండలో శ్మశాన వాటిక స్థల సేకరణ రెండు రోజులలో పూర్తి చేస్తామని సబ్ కలెక్టర్ వివరించారు. 34 అట్రాసిటీ కేసులలో ఎస్సీ, ఎస్టీ ప్రజలకు 83 లక్షల రూపాయలు ఆర్థిక పరపతి కల్పించామని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో ఎక్కడా కల్లు దుకాణాలు ఉండకుండా చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి పోలీసుశాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ ల సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తనకల్లు లోని బాలికల వసతి గృహంలో ప్రత్యేక మహిళా పోలీస్ సిబ్బందిని నియమించి భద్రత కల్పిస్తామన్నారు. అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, ఎస్‌పిటిఓలు వాసుదేవన్, శ్రీలత, వరప్రసాద్, పెనుకొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, డిఆర్‌డిఏ పీడీ నరసయ్య, ఎస్సీ సంక్షేమ అధికారి మోహన్ రామ్, కమిటీ సభ్యులు వెంకటేష్, శ్రీనివాసులు, గంగులయ్య, సురేష్ పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

వ్యాపార నైపుణ్యాలను పెంపొందిస్తాం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణ మహిళలకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి, తద్వారా సుస్థిర జీవనోపాధి కల్పన ఆర్థిక సాధికారతను సాధింపజేయడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కౌన్సిల్ హాల్ లో పట్టణ మహిళా డ్వాక్రా సంఘం సభ్యులు ఆర్పీలకు జగనన్న మహిళా మార్ట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాచర్ల లక్ష్మీ మాట్లాడుతూ త్వరలో పట్టణంలోని కాయగూరల మార్కెట్ లో గల మీసేవ కేంద్రం క్రింది భాగాన గల స్థానంలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్ వలన నాణ్యమైన సరుకులతో పాటు తక్కువ ఖర్చుతో వివిధ రకాలైన సరుకులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మహిళా మార్ట్‌ను నెలకొల్పుతున్నట్లు చెప్పారు. జగనన్న మహిళా మార్ట్ దైనందిక కార్యక్రమాల నిర్వహణ కొరకు చట్టపరమైన అనుమతులు పొందుటకు 11 మందితో కార్యనిర్వాహక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ మహిళా మార్ట్ గూర్చి కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుధాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ వెంకటేశులు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి

క్రికెటర్‌కు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

అక్టోబర్ 12వ తేదీ నుండీ 18వ తేదీ వరకు బంగ్లాదేశ్‌లో యునైటెడ్ గోల్డెన్ సిటిజెన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ టి-20 భారత్ - బాంగ్లాదేశ్ వికలాంగుల క్రికెట్ టోర్నమెంట్ జరుగుతోంది. ఈ మేరకు హిందూపురం పట్టణంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉన్న భారత వికలాండుల క్రికెట్ టీం కెప్టెన్ వై.వసంత్ కుమార్‌ను ఎంపిక చేస్తు ఆహ్వానాన్ని పంపారు. ఈ విషయం తెలుసుకున్న బాలయేసు విద్యాసంస్థల అధ్యక్షులు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి మంగళవారం కళాశాలకు వై.వసంత్ కుమార్‌ను పిలిపించి అభినందించారు. బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లేందుకు ఆర్థికచేయూతను అందించారు. ఈ కార్యక్రమంలో సడ్లపల్లి ప్రణయ్ రెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుడికి పింఛను అందజేత

ప్రజాశక్తి - కదిరి టౌన్

తనకల్లు మండలం చీకటిమానుపల్లికి చెందిన నజురుల్లా కుమార్తె తానియా హిమోఫిలియా వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్నితనకల్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే సిద్దారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితుడిని ఆదుకునే చర్యలు చేపట్టారు. మెడికల్ బోర్డు పింఛనుకు దరఖాస్తు చేయించి మంజూరుకు కృషి చేశారు. దీంతో పింఛను మంజూరు కావటంతో రూ. 10 వేలను పింఛనును బాధితుడికి అందజేశారు. పింఛను మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యేను తానియా కుటుంబ సభ్యులు కలసి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - గాండ్లపెంట

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గొడ్డు వెలగల సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామా నాయక్, వైద్యాధికారులు మహేశ్వరి, మారుతి ప్రసాద్, ఫక్రుద్దీన్, ఫార్మసీ సిబ్బంది ప్రసాద్, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ జి. రవీంద్రారెడ్డి ప్రజలు తదితరులు పాల్గొన్నారు

తలుపుల : మండలంలోని ఈదులకుంట్ల పల్లి పంచాయతీ, మంగివాండ్ల పల్లి గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ మున్వర్‌బాషా, డాక్టర్ సల్మా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి నుంచి ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి నుంచి కంటి వైద్య నిపుణులు హాజరయ్యారు.

బత్తలపల్లి : రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. మంగళవారం మండలంలోని పోట్లమర్రి గ్రామ సచివాలయంలో సర్పంచి అక్కిం దామోదర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గంగిరెడ్డి, ఎంపీడీవో సాయి మనోహర్, డాక్టర్ రామకష్ణ, వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, హనుమంత రెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం గుడ్డు గుడికి పంచాయతీ కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆజాద్, తహశీల్దార్ హసీనా సుల్తాన్, డాక్టర్ ప్రణీత రెడ్డి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోఒకటవ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్‌నారాయణ మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ జయరాం నాయక్, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, రామలక్ష్మమ్మ, సర్పంచి సరోజ, ఎంపీడీవో రఘునాథ్ గుప్త, తహశీల్దార్ రంగనాయకులు, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు


మడకశిరలో జగనన్న సురక్ష కార్యక్రమం

బత్తలపల్లి : తాడిమర్రి మండలంలో చిల్లవారిపల్లి గ్రామపంచాయతీ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెద్ద శివారెడ్డి, మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ రామాంజనేయులు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఈవోఆర్డీ కామాక్షి, ఏపీవో సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితుడికి 10 ఏళ్లు జైలు

పుట్టపర్తి రూరల్ : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో న్యాయస్థానం నిందితుడికి 10 సంవత్సరాలు జైలు శిక్ష, 2వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించిన వివరాలు.. గాండ్ల పెంట మండలం, సోమయాజులపల్లి పంచాయతీ ఎర్ర చేను పల్లి గ్రామానికి చెందిన ఇరగదిండ్ల గంగరాజు ఏడుసంవత్సరాల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఫోక్సో కోర్టులో విచారణ అనంతరం జడ్జి మంగళవారం తీర్పును వెలువరించారు. నిందితుడు ఇరగదిండ్ల గంగరాజు చేసిన నేరం రుజువు కావడంతో 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 2వేల రూపాయలు జరిమానాగా విధిస్తూ తీర్పు ఇచ్చారు. సాక్షాదారాలను నిరూపించి నిందితునికి శిక్షపడేలా చేసిన పోలీసులను ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అభినందించారు.

భూకబ్జాపై ఫిర్యాదు

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని గుంజేపల్లి పొలం సర్వేనెంబర్ 823-బి లో 99 సెంట్ల భూమిని ఆక్రమిస్తున్నారని సంబంధిత అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దేవేందర్ రెడ్డి, కంఠగాని నారాయణస్వామి, జయకృష్ణ, లక్ష్మీనారాయణ, సురేష్ రెడ్డి, జెసిబి రెడ్డప్ప, లేపాక్షి, నరేష్ తదితరులు పాల్గొన్నారు

న్యాయవాది ఇంట్లో చోరీకి యత్నం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలోని సత్యాసాయినగర్‌లోని న్యాయవాది అబ్దుల్లా ఇంట్లో సోమవారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. న్యాయవాది పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు... న్యాయవాది అబ్దుల్లా ఇంటికి తాళం వేసి తన కుటుంబంతోసహా పనిమీద వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి స్కూటిలో వచ్చిన అగంతకుడు ఇంటి ప్రహరీ ఎక్కి రాడ్డుతో తలుపు తాళం పగలకొట్టేందుకు ప్రయత్నించాడు. ఎంతసేపటికి తాళం రాలేదు. చివరికి పైనున్న సీసీ కెమెరాను గమనించి వెంటనే పారిపోయాడు. ఉదయం ఇంటికి వచ్చి గమనించిన న్యాయవాది సీసీ కెమెరా రికార్డు చూశాడు. అందులో దొంగ తలుపులు పగలకొట్టే దృశ్యం కనిపించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

కదిరి టౌన్ : కదిరి వెలుగు ఆఫీస్ ఎదుట సిపిఐ కాలనీలో స్థలం విషయంలో జరిగిన గొడవలో పట్టణ పోలీసులు పలువురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి బాధితుడు తిమ్మప్ప పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు.. సిపిఐ కాలనీలో గతంలో పేదలకు ఇచ్చిన ఇంటిపట్టాల విషయంలో తిమ్మప్పపై దాడి చేసి, కులం పేరుతో దూషించినారని కదిరి పట్టణం అమీన్ నగర్ కు చెందిన బొగ్గిటి మునికుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సోము, మధు, అంజినేయులు, అజయ్‌పై కేసు నమోదు చేశారు. ఇదే ఘటనలో కదిరి పట్టణం పార్ధ సారథి కాలనీకి చెందిన ఆదిలక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు మునికుమార్, తిమ్మప్ప, కదిరప్పపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం కలిగే విధంగా పోలీసు సేవలు అందించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. పెనుగొండ టౌన్ నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన పి రాజా రమేష్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం రేంజ్ లో సిఐగా పనిచేస్తున్న పి రాజా రమేష్ సిఐల బదిలీలలో భాగంగా పెనుగొండ టౌన్ సిఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సిఐ, ఎస్పీ ని కలిశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ మాధవ్ రెడ్డి సిఐకి సూచించారు.

మాజీ ఎంఇఒ మృతి

కదిరి టౌన్ : కదిరి పట్టణానికి చెందిన రిటైర్డ్ మండల విద్యాధికారి అల్లాబకాష్ అనారోగ్యంతో మృతిచెందారు. అల్లాబకాష్ మృతి విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమానిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈశ్వరయ్య తల్లి గంగులమ్మ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధితులకు ధైర్యం చెప్పారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. నగదుగా రూ.84,63,505లు, బంగారు 154 గ్రాములు, వెండి 2కేజీల 300 గ్రాములు వచ్చాయి. విదేశీ కరెన్సీ అమెరికా డాలర్లు 195, కెనాడా 40, స్విట్జర్లాండ్ 60, ఒమెన్ 1, రియాండ్ 55 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మొత్తం 53 రోజులకు వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమములో ఆలయ కమిటి ఛైర్మెన్ జెరిపిటి గోపాల క్రిష్ణ, ఆలయ కార్యనిర్వాహాధికారి వెండిదండి శ్రీనివాస రెడ్డి, హుండీ పర్యవేక్షణాధికారిగా నరసింహరాజు, పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, కెనరా బ్యాంకు కదిరి మేనేజర్ మధుసుదన్, కెనరా బ్యాంకు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైసిపివి కుటిల రాజకీయాలు


నిరసన దీక్షలో పాల్గొన్న పల్లె, తదితరులు


నిరసన దీక్షలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి


పెనుకొండలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి



ధర్మవరంలో సంఘీభావ ర్యాలీలో పరిటాల సునీత, తదితరులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును జైల్లో ఉంచి ఎన్నికలలో గెలవాలని కుటిల రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 21వ రోజుకు చేరాయి. ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు చేతులు పైకెత్తి దండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లె, నిమ్మల మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. జగన్ ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. బాబును విడుదల చేసే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రత్నప్ప చౌదరి, పుల్లప్ప, సామకోటి ఆదినారాయణ, జనసేన పార్టీ నాయకులు అబ్దుల్లా, పత్తి చంద్రశేఖర్ తోపాటు నియోజకవర్గంలోని పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గుడిబండ : చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదల అయ్యేంతవరకు తమ పోరాటం ఆగదని మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక నాయకులతో కలసి 10 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప, ఉగ్రనరసింహప్ప, జయరామిరెడ్డి, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వర్థరామప్ప, మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని వై. బి హళ్లి పంచాయతీ కేంద్రంలో టిడిపి నాయకులు రిలేదీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వైసిపికి చెందిన గ్రామంలోని కోడిపల్లి హనుమంతరాయప్ప, ఆయన అనుచరులు ఐదు కుటుంబాలు మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపి లోకి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు మనోహర్, రొళ్ల కన్వీనర్ దాసిరెడ్డి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మంజునాథ్,ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, వైబి హళ్లి సర్పంచి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్మవరంలో చేపట్టిన పరిటాల శ్రీరామ్ చేపట్టిన సత్యమేవ జయతే ర్యాలీకి మండల తెలుగుదేశం ముస్లిం క్లస్టర్ ఇంచార్జ్ ఎస్ఆర్.రఫీ తన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, మటన్ ఆయుబ్, గుంజేపల్లి మహబూబ్ పీరా, రహీం, వెల్డర్ రియాజ్, మండల సీనియర్ నాయకులు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ధర్మవరంలో భారీ శాంతి ర్యాలీ చేపట్టారు. ముస్లీం మైనార్టీల ఆధ్వర్యం లో మంగళవారం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో శాంతిర్యాలీని చేపట్టారు.ఈ ర్యాలీలో మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు బీకే పార్థసారధి, జనసేన పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. పల్లవి థియేటర్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీకి వాల్మీకులు సంఘీభావం తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్దగల దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. అక్కడ పరిటాల సునీత, పరిటాల శ్రీరాం, ముస్లింలతో కలిసి దువా చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు.

కొత్తచెరువు : చంద్రబాబు నాయుడుపైఅక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసి జైలుకు పంపడం తగదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు మంగళవారం రాత్రి కొత్తచెరువు లోనే మస్తాన్‌వలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గత 23 రోజులుగా నిరసనలు ధర్నాలు చేస్తున్నారన్నారు. ఆయనను వదిలిపెట్టే అంతవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి మాణిక్యం బాబా, మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్‌షాప్ బాబా, టిడిపి నాయకులు మౌలా షర్ఫుద్దీన్, సయ్యద్‌బాషా, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రతి ఒక్కరూ నిరసన గళం వినిపిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ కదిరి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం 24 రోజు రిలే రెడ్డి సంఘం అధ్వర్యంలో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, మాజీ సర్పంచులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలో ప్రజాస్వామ్యంతో సంబంధం లేని ప్రభుత్వం నడుస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో టిడిపి నాయకులు, ఉప్పర సగర సంఘం నాయకులు దీక్ష చేపట్టారు. అర్ధనగ్నంగా మోకాళ్లపై కుర్చోని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నరసింహులు యాదవ్, బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, అంజినప్ప సగర నియోజకవర్గ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కదిరిప్ప, పార్లమెంటు కన్వీనర్ వెంకటనారాయణ, నాయకులు రామప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : జగన్ అరాచకాలును ప్రశ్నించినందుకే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని అక్రమ అరెస్ట్ చేయించారని టీడీపీ జిల్లా అధ్యక్షులు బి.కె .పార్థసారథి విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే బి.కె. పార్థసారథి ఆధ్వర్యంలో 21వ రోజు సామూహిక నిరాహార దీక్ష ను నిర్వహించారు. ఈ సందర్భంగా బి. కె. పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు ని అరెస్ట్ చేసి జైలులో పెట్టడం జగన్ నియంతృత్వ పోకడలకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి సతీమణి కమలమ్మ, కుమారుడు సాయి కళ్యాణ్,నాయకులు కురుబ కృష్ణమూర్తి,కన్వీనర్ సిద్దలింగప్ప, నాయకులు జీవీపీ నాయుడు, సుబ్బరత్నమ్మ, రొద్దం నరసింహులు, మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, భానుకీర్తి, రామక్రిష్ణప్ప,అనసూయమ్మ, నాగమణి, చంద్రకాంతమ్మ, రత్నమ్మ, సుజాతమ్మ,గాయిత్రి, సంజీవరెడ్డి, రామకృష్ణ,లక్ష్మీనారాయణ రెడ్డి, రామలింగ, గొందిపల్లి సూరి, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.